"అదంతా ఒక పెద్ద పీడకల" అని నా నిరాశావహమైన కథ అతి కొంచెం చెప్పి ఊరుకున్నాను. "బాత్‌రూం-" అన్నాను, టాపిక్ మార్చాలని.

నేను బాత్రూం నుంచి వచ్చేసరికి కూర సూపుకి రడీగా వుంది. సహదేవరావు తన బెడ్రూం నుంచి ఫోన్‌లో ఎవరిమీదనో అరుస్తున్నాడు. కూర సంగతి చూసేసరికి వచ్చాడు.

"అలా అరవాల్సిందేనా?" అన్నాను.

"రొటీన్. అంతా రొటీన్! అరవక పోతే కొన్ని పన్లు అవవు."

రెండు గంటలకి సహదేవరావు ఆఫీసు (సెక్రటేరియట్) పరిచయాలు. ఫైళ్లు చూస్తూ సహదేవరావు జోకులు, ఫోన్ కాల్సు. "జస్టే మినిట్లు", టైం నాలుగయ్యేసరికి కాఫీలు.

"ఓకే. పద!" అని సహదేవరావు లేచాడు. మళ్లీ అతనే కారు నడిపేడు. నడిపీ నడిపీ మా డైరెక్టరు ఆఫీసు వద్ద కారు ఆపేడు. నన్ను కార్లో కూర్చోమని తను లోపలికెళ్లేడు.

రెండు నిమిషాల్లో రెండు కవర్లు చేత పుచ్చుకుని వచ్చి కార్లో కూర్చున్నాడు సహదేవరావు. రెండు కవర్లూ నాకే ఇచ్చేశాడు.

"అది నీ ఆర్డరు, నిన్ను విశాఖపట్నం కలెక్టరాఫీసులో వేశారు. రెండో కవరులో కలెక్టర్ కాపీ ఉంది. వెళ్లి జాయినైపో. కారు దిగి నీ దార్ని నువ్వు వెళ్లు. నాకు పనుంది."

కారు దిగి - అన్నమాట మాత్రం అర్థమైంది. దిగాను. సహదేవరావు తలుపు మూశాడు.

"అది కాదూ, -" అన్నాను.

"అదంతే. నువ్వు బాత్రూం కెళ్లినపుడు నువ్వు అక్కడ వదిలిన కాగితం చూశాను.ఫోన్‌లో కథంతా నడిచింది. మీ జాయింట్ డైరెక్టర్ వేసిన ఆర్డర్స్‌ని మీ డైరెక్టరు చేత మార్పించేను. ఆఫ్‌కోర్స్; నువ్వు నన్ను అడిగుంటే చేసుండకపోదును. విష్ యు బెస్టాఫ్ లక్."

కారు కనుమరుగైంది; కళ్లు బైర్లు కమ్మి. కాదు. కారు నిజంగానే వెళ్లిపోయింది.

"న-న-నమస్కారం సార్!" అన్నాను అప్రయత్నంగా, ఎదుట ఇంకో కారు దిగిన మా జాయింట్ డైరెక్టర్‌గారు కనబడగానే.

"పోవయ్యా, పో! ఆర్డర్ తీస్కో పో. చెప్పించావుగా ఎవుడో మినిష్టరుతో!" అన్నాడు కస్తూరి పేరుగల జె.డి. గారు మొహం మాత్రం చిరాగ్గా పెట్టి.

★

# 53. నేతాజీకి దండ

**1970**ల్లో ఒక రోజున నేను హైదరాబాద్‌లో ఏదో పనిమీద వెళ్లి ఉండగా; విజయనగరం కాలేజీలో నాకు రెండేళ్ళు సీనియర్ అయిన లక్ష్మణరావు చాలా యాదృచ్ఛికంగా తగిలేడు. నేను ఇటువేపు వెళ్లడానికని ఒక బస్సుస్టాపులో నిలబడి ఉంటేను, అటువైపు వెళ్తున్న ఓ కారు; ముందుకి వెళిపోతూ చటుక్కున ఆగింది. ఆ కారు డ్రయివరు ఒక తమాషా అయిన ఈల లాంటిది వేస్తే బస్సుస్టాపులో నిలబడ్డ వాళ్లలో సగంమంది అటు చూసేరు.

(మిగతా సగం మందీ ఆడవాళ్లు. అంచేత చూసినా మనకి తెలీదు.) ఆ డ్రయివరు ఒక వేలు ఆడించడం ద్వారా నన్ను స్పాట్ చేసి రమ్మని సంజ్ఞ చేసాడు. "నీ - వేలే - నను పిలిచినది!" అని పరుగెట్టుకుంటూ వెళిపోడానికి అది మాయాబజారూ కాదు, నేను సావిత్రినీ కాదు. అంచేత నేను (ఎఫెక్టివుగా వుంటుందని) ఏకంగా నాలుగు వేళ్లు ఉపయోగించి అతన్ని పిలిచేను. అప్పుడా డ్రయివరు తన తల వెనక్కి తిప్పి ఆ కారు వెనక సీట్లోకి ఏదో మెసేజి ఇచ్చేడు. తరవాత ఒక నిమిషానికి డ్రయివరు కారు దిగి, వెనక డోరు తెరవడం, అందులోంచి తెల్లటి పైజమా తెల్లటి జుబ్బా ధరించిన ఓ తేజోమూర్తి దిగడం, అతను నల్ల కళ్లద్దాలు తియ్యగానే అతను లక్ష్మణరావని నేను గుర్తుపట్టడం; అతను చెయ్యి వూపగానే నేను రోడ్డు దాటడం వరసగా జరిగిపోయాయి.

లక్ష్మణరావు నన్ను తనతో ఒచ్చీమన్నాడు. నాకు ఫలానా చోట అర్జంటు పనొకటుంది, రాలేనన్నాను. నేనిప్పుడు మంత్రినన్న సంగతి నీకు తెలుసుకదా; మా బంగ్లా నుంచి ఫోన్‌చేస్తే నీ పని అవదా; అన్నాడు. చివరికి అతనితో బంగ్లా దాకా వెళ్లేటట్టూ; అతని కారులో అతని పి.ఏ.నో మరో చిన్న ఉద్యోగినో వెంట పెట్టుకుని నాకు పని ఉన్న చోటికి వెళ్లేటట్టూ; వస్తూ వస్తూ నేను దిగిన "డర్టీ" హోటల్లో గది ఖాళీచేసేసి మకాం అతని బంగ్లాకి మార్చేసేటట్టూ ఒప్పందం కుదిరింది.

నా పనులయిపోయాక నేను మళ్లీ మినిష్టరు లక్ష్మణరావు బంగ్లాకి చేరేటప్పటికి మా కారు (అదే; మినిష్టరు గారి కారు) పక్కనించే ఇంకో కారు పోర్టికోలో ఆగడం సంభవించింది. ఆ కారులో వచ్చింది సహదేవరావు. ఢిల్లీలో ఆకాశవాణి డి.డి.జి.గా వున్నాడట. హలో అంటే హలో అనీ, ఓహో అంటే ఓహో అనీ అనుకుని ఇద్దరం లోపలికెళ్లాం.

మేం వెళ్లేసరికి మినిష్టరు లక్ష్మణరావు గారు "ఆభ్యంతర మందిరం" లాంటి రహస్య సమావేశ మందిరంలో ఉన్నారు. చుట్టూరా ఒకరిద్దరు ఛోటా నాయకులూ నలుగురు "దళపతులూ" ఉన్నారు. వాళ్లు దేన్ని గురించి అంతసేపూ మాట్లాడుకున్నారో మాకు తెలియకుండానే పోయేది; "ఓకే సార్; వస్తాం సార్" అని వెళిపోతున్న వాళ్లని లక్ష్మణరావు వెనక్కి పిల్చి "విగ్రహం, ఆ ట్రాఫిక్ ఐలాండూ అన్నీ ఇప్పుడే బాగా క్లీన్ చేయించి ఈ రాత్రి అక్కడెవరూ గలీజు చెయ్యకుండా గార్డు పెట్టండి" అని చెప్పకపోతేను.

వాళ్లు అలా వెళ్లనిచ్చి సహదేవరావు మామూలు పలకరింపు అయినా చెయ్యకుండా "విగ్రహం ఏమిటి; క్లీన్ చెయ్యడమేమిటి?" అని అడిగేడు.

లక్ష్మణరావు "మీకేం గుర్తుండదు!" అని వేళాకోళంగా నవ్వేసి; "రేపు నేతాజీ సుభాష్ చంద్రబోసు జన్మదినం. ఈ జంటనగరాల్లో ఇప్పటికి బోసుబొమ్మ ఒక్కటంటే ఒక్కటే ఉంది. రేపు ఉదయం ఎనిమిది గంటలకి బోసుబొమ్మకి పుష్పమాల వేసి, జంటనగరాల్లో ఇతోధికంగా బోసు బొమ్మలు ప్రతిష్ఠించాలని ఉద్బోధించే కార్యక్రమం ఉంది. సమయానికి ఛీఫ్ మినిష్టరు గారు ఊళ్లో లేరు కనక అదృష్టం మనదైంది" అని వివరించేరు. గాంధీ జన్మదినం, నెహ్రూ జన్మదినంలా నేతాజీ జన్మదినం గుర్తు పెట్టుకోనందుకు నేను పశ్చాత్తాపపడ్డాను.

పక్కనే ఒక డమ్మీ దండ; ఒక మోడల్ స్పీచి ఉన్నాయి. "ఈ దండేమిటి, వేస్ట్ కాటన్‌తో చేసినట్టుంది?" అన్నాను; ఏదో ఒకటి నేను కూడా అనకపోతే ఎలాగా అని.

లక్ష్మణరావు మళ్లీ వేళాకోళంగా నవ్వేడు. "అది డమ్మీవోయి. అసలు దండ పొడుగూ లావూ ఎలా ఉంటాయో దానికి ఆది అన్నమాట. దీంతో మనం రిహార్సల్ వేసుకోవచ్చు. మా లాన్స్‌లో ఈ బంగ్లా ఓనర్ గారు పెట్టించిన మహబూబ్ ఆలీఖాన్ గారి విగ్రహం ఎంత ఎత్తు వుందో రేపు నేను దండ వెయ్యబోయే బోసుబొమ్మ సరిగ్గా అంత ఎత్తే వుంది. అంచేత స్టూలు వేసుకుని ప్లాట్‌ఫాం ఎక్కడం, గార్లండింగు ఇక్కడే రిహార్స్ చేస్కోవచ్చు" అని వివరించేడు.

ఆ తరువాత కొంతసేపు మేం ముగ్గురం ఇష్టాగోష్ఠిలో గడిపేం. సహదేవరావు ఒద్దంటున్నా వినక లక్ష్మణరావు మంచిరకం బిస్కెట్లూ అంతకంటే మంచిరకం టీ తెప్పించి పెడితే-ఏమాట కామాటే చెప్పుకోవాలి - వాళ్లిద్దరికన్నా ఇష్టంగా నేను వాటిని ఆరగించేను.

ఆ ప్లేట్లూ కప్పులూ వెళిపోయాక మినిష్టర్ లక్ష్మణరావు గారు "ఎలా వుంది, కొత్త వుద్యోగం? డిప్యూటీ సెక్రటరీగా ఉన్నన్నాళ్లు రాష్ట్రంలో మీకు మంచి మేధావిగా పేరొచ్చింది. మరి, ఆలిండియా రేడియో జాతీయ సంస్థ కదా. అక్కడ మీకు దీటైన మేధావులు ఎక్కువమందే ఉంటారు. వాళ్ల మధ్య మన ఆంధ్రులు స్థిరంగా నిలబడలేకపోవడం వుంది, అందుకని అడుగుతున్నాను!" అన్నారు, సహదేవరావుతో.

"నన్ను ఏ డిపార్టుమెంటులో ఏ పోస్టులో వేసినా ఆ సంగతి నాకు కనీసం పదిహేను రోజులు ముందుగా తెలుస్తుంది. అంతకిముందు ఆ డిపార్టుమెంటులో కింది ఉద్యోగాలు దేంట్లోనూ నేను పనిచెయ్యకపోయినా. ఆ పదిహేను రోజుల్లో ఆ డిపార్టుమెంటు పని విధానం, బాధ్యతలు నేను గ్రహించే పద్ధతులు నాకు ఉన్నాయి. మాట వరసకి పంచాయితీ రాజ్, ఇరిగేషన్, ఫిషరీస్ లాంటి డిపార్టుమెంటుల్లో ఏం చేస్తారో నాకు ఆ డిపార్టుమెంటుల్లో నన్ను వెయ్యకముందు అసలేమీ తెలియదు. ఐనా నేను క్షణాల మీద నిలదొక్కుకుని ఆ డిపార్టుమెంటుల్లో నా ముద్ర వెయ్యగలిగాను" అన్న సహదేవరావు సమాధానసారాంశంగా ఆ సంభాషణ కొంతసేపు నడిచింది.

"రేపు ఉదయం ఎనిమిదింటికి మీకు ఖాళీ ఉంటే నేతాజీ విగ్రహం దగ్గిరికి రండి; చాలా సంతోషిస్తాను! అఫ్‌కోర్స్; పత్రికల వాళ్లతోబాటు రేడియో ఆఫీసర్లకి కూడా ఈ పుష్పమాలా లంకరణ కార్యక్రమానికి విచ్చేసి "కవర్" చెయ్యమని లెటర్స్ వెళ్లేయనుకోండి. కాని సాక్షాత్తు ఆలిండియా రేడియో సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గారు ఆ ఫంక్షన్ కొచ్చేరంటే నాకు అది ప్రత్యేకమైన గౌరవం అవుతుంది కదా" అన్నారు మినిష్టరు లక్ష్మణరావు.

సహదేవరావు నవ్వేడు. "మీకు గౌరవం జరగడం కన్నా నేతాజీకి అగౌరవం జరక్కపోవడం ముఖ్యం ... ... ... మీరేం అనుకోకపోతే ఈ డమ్మీ దండ తీసుకుని మీ లాన్స్‌లో ఉన్న విగ్రహం దగ్గిరికెళదాం వస్తారా?"

"ఓ!! దానికేం భాగ్యం!!"

ముగ్గురం లేచాం. తన వెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధ వ్రాతమున్, దాని వెన్కను పక్షీంద్రుడు - అన్నట్టు దండ పట్టుకోడానికి ఒకడు, స్టూలు తేవడానికి ఒకడూ అయ్యగారు ఆ (పుష్ప) మాలాలంకరణ - ప్రయత్న - కార్యక్రమంలో ఎటైనా వొరిగితే కాయడానికి ఇద్దరూ ఇలా మొత్తం పదిమందిలాగ అయ్యాం; లాన్స్‌లో.

మినిష్టరు లక్ష్మణరావు గారు ఏమాత్రం తడబాటు పడకుండా స్టూలు ఎక్కి పెడెస్టల్

ఎక్కి ప్లాట్‌ఫారం ఎక్కి డమ్మీ దండని అవలీలగా మహబూబ్ ఆలీఖాన్ విగ్రహం మెడలో వేసేశారు.

అంతకంటే అవలీలగా దిగిపోయి "సోదర సోదరీమణులారా!" అని ఉపన్యాసం రిహార్సలుకి నాంది పలికారు.

"మనం ఇక్కడ కొంచెంసేపు గడుపుదాం, వీరందరినీ వాళ్ల పనుల మీద ఉండమని పంపించెయ్యండి" అన్నాడు సహదేవరావు. వాళ్లు వెళ్లిపోయారు.

"చూడండి, లక్ష్మణరావు గారూ! రేపు ఇలా జరగదు!!" అన్నాడు సహదేవరావు.

"ఏం?"

"నేతాజీ విగ్రహం ఇలా ప్లెయిన్‌గా ఉండదు. మన దేశం మొత్తం మీద ఎక్కడ నేతాజీ విగ్రహం ఉన్నా చూడండి; ఆయన యూనిఫాంలో నిలబడి, కుడి చేత్తో సెల్యూట్ కొడుతున్న భంగిమలోనే ఉంటుంది. ఆయన కుడి చెయ్యి నుదుటికి ఆనించి ఉండడం వల్ల మీరు ఎంత ప్రయత్నించినా దండని ఆయన నడుంకి వెయ్యగలుగుతారు తప్పా మెడలో వెయ్యలేరు."

"చచ్చాం, పో!" అని లాన్స్‌లోనే కూలబడ్డారు మినిస్టరు గారు. వెంటనే ఆ లాన్స్ మెత్తదనం మమ్మల్నీ అనుభవించమన్నట్టుగా "కూచోండి" అన్న సంజ్ఞచేశారు. "పోనీ - పూలదండలో దారం దాగుందని తెలుసును - అని కవి అన్నాడు కదా! ఆ దారం కాస్త పొడుగ్గా పెట్టించి కొసలు రెండూ విడిగాపుచ్చుకుని ప్లాట్‌ఫాం ఎక్కాక ఆ రెండు కొసల్నీ నేతాజీ మెడలో ముడి వేస్తేనో?" అన్నాను.

"అప్పుడు ఇంకా అపహాస్యం పాలవుతాం. 'నేతాజీకి తాళికడ్తున్న మినిష్టర్' అని ఏ పత్రిక వాళ్లో ఫోటోకింద కాప్షన్ రాస్తారు. అబ్బో; వద్దు;" అన్నారు లక్ష్మణరావు.

వెల్‌క్రో అనే మేల్ - ఫిమేల్ క్లిప్పర్స్ దారానికి ఉండే రెండు కొసలకీ అమర్చి కన్నుమూసి తెరిచేలోగా పని పూర్తి చెయ్యవచ్చునని సహదేవరావు బోధ పరిచాడు. మినిష్టర్ లక్ష్మణరావు ఆ ఉపాయం తన "దండ" నాయకులకి చెప్పడానికి పరుగెత్తారు.

"ఇంతకీ నేతాజీ మీద ఈయన కెందుకో ఇంత భక్తి?" అన్నాను.

"ఆయన నేతాజీ; ఈయన చేనేతాజీ!" అన్నాడు సహదేవరావు; చేనేత, జౌళి పరిశ్రమల మంత్రి లక్ష్మణరావును సమర్థిస్తూ.

★

# 54. 'నీవుండే దా కొండపై!'

**"అ**న్నట్టు, మొన్నీ మధ్య కొండలరావు కనబడ్డాడోయ్" అన్నాడు కాశీపతిరావు; మేం ఇద్దరం ఆ కాఫీహోటల్లో పావుగంటసేపు కబుర్లు చెప్పుకున్నాక.

"ఏ కొండలరావు?"

"ఇంకెవడు; మన ఏడు కొండలరావే!"

"ఎక్కడ కనబడ్డాడు?"